సూపర్ సిక్స్..సూపర్ మోసం





కావలి/ఉదయగిరి/ఆత్మకూరు: ఒకటి కాదు.. రెండు కాదు..సూపర్‌సిక్స్ పేరుతో మేనిఫెస్టోలో కొన్ని.. ఎన్నికల ప్రచారంలో ఇంకొన్ని.. జగన్ ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేస్తుందో వాటన్నింటికి మరింత అదనంగా నిధులు ఇస్తాం ..అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తాం అంటూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఊరూవాడా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల కింద ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం..నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు అందజేస్తాం..ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం..ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఖాతాల్లో జమచేస్తాం..మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం..ఇలా మేనిఫెస్టోలోని హామీలను గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక మాటల్లో చెప్పిన హామీలను చేతల్లో చూపడం మరిచారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతులకు ఇంతవరకు సాయం అందజేయలేదు. బడులు తెరిచి నెలలు గడిచినా అమ్మఒడి ఇవ్వలేదు. నిరుద్యోగభృతి ఊసేలేదు. ఇలా ప్రతి పథకం అతీగతి లేదు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసి మాట నిలుపుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జగన్ పాలనలో సంక్షేమ సిరులు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా ఐదేళ్ల పాలనలో సంక్షేమానికి గత జగన్ సర్కార్ పెద్దపీట వేసింది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా..పేదరికమే ప్రామాణికంగా అట్టడుగు స్థాయికి ప్రభుత్వ పథకాలను చేరవేసింది. ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేస్తూ పేదలకు భరోసా కల్పించారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. వారి ద్వారా గడప గడపకు సంక్షేమ పథకాలను చేరవేశారు. అవ్వాతాతలకు పింఛన్ అందించారు..రైతులుక రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించారు. రుణమాఫీతో డ్వాక్రా మహిళలను ఆదుకున్నారు. అమ్మఒడి అందజేసి పిల్లల చదువును ప్రోత్సహించారు. చేయూత, చేదోడు పథకాల ద్వారా మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారు..ఇలా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా భరోసా కల్పించారు.

తల్లికి వందనం



ఉదయగిరి నియోజకవర్గం
అర్హులు: 46,325
వెచ్చించాల్సిన మొత్తం - రూ.69.54 కోట్లు (ఏడాదికి)

ఆత్మకూరు నియోజకవర్గం
అర్హులు: 35,570
వెచ్చించాల్సిన మొత్తం- రూ.53.35 కోట్లు (ఏడాదికి)

కావలి నియోజకవర్గం
అర్హులు: 22,500
వెచ్చించాల్సిన మొత్తం -రూ.33.75 కోట్లు(ఏడాదికి)

అన్నదాత సుఖీభవ



ఉదయగిరి నియోజకవర్గం
అర్హులు: 37,419
వెచ్చించాల్సిన మొత్తం- రూ.74.83 కోట్లు(ఏడాదికి)

ఆత్మకూరు నియోజకవర్గం
అర్హులు: 31,570
వెచ్చించాల్సిన మొత్తం- రూ.63.14 కోట్లు(ఏడాదికి)

కావలి నియోజకవర్గం
అర్హులు: 29,500
వెచ్చించాల్సిన మొత్తం -రూ.59.00 కోట్లు(ఏడాదికి)

ప్రతి మహిళకు నెలకు రూ.1500



ఉదయగిరి నియోజకవర్గం
అర్హులు: 76,245
ప్రభుత్వం వెచ్చించాల్సిన మొత్తం -రూ.11.43 కోట్లు (నెలకు)

ఆత్మకూరు నియోజకవర్గం
అర్హులు: 42,580
వెచ్చించాల్సిన మొత్తం -రూ.6.87 కోట్లు(నెలకు)

కావలి నియోజకవర్గం
అర్హులు: 75,000
వెచ్చించాల్సిన మొత్తం -రూ.11.25 కోట్లు(నెలకు)

నిరుద్యోగ భృతి



ఉదయగిరి నియోజకవర్గం
అర్హులు: 72,438
నెలకు వెచ్చించాల్సిన మొత్తం -21.73 కోట్లు

ఆత్మకూరు నియోజకవర్గం
అర్హులు: 30,650
వెచ్చించాల్సిన మొత్తం -9.19 కోట్లు (నెలకు)

కావలి నియోజకవర్గం
అర్హులు: 45,000
వెచ్చించాల్సిన మొత్తం -13.50 కోట్లు (నెలకు)

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు



ఉదయగిరి నియోజకవర్గం
అర్హత ఉన్న కుటుంబాలు- 72,438
ఏడాదికి అందజేయాల్సిన సిలిండర్లు- 2,17,314
ప్రభుత్వం వెచ్చించాల్సిన మొత్తం -రూ.18.47 కోట్లు (ఏడాదికి)

ఆత్మకూరు నియోజకవర్గం
అర్హత ఉన్న కుటుంబాలు- 36,526
ఏడాదికి అందజేయాల్సిన సిలిండర్లు- 1,09,578
వెచ్చించాల్సిన మొత్తం -రూ. రూ.9.31 కోట్లు (ఏడాదికి)

కావలి నియోజకవర్గం
అర్హత ఉన్న కుటుంబాలు- 90,000
ఏడాదికి అందజేయాల్సిన సిలిండర్లు- 2,70,00
వెచ్చించాల్సిన మొత్తం -రూ.22.95 కోట్లు (ఏడాదికి)

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఉదయగిరి నియోజకవర్గం
అర్హులు: 1,24,000

ఆత్మకూరు నియోజకవర్గం
అర్హులు: 1,09,578

కావలి నియోజకవర్గం
అర్హులు: 1,25,000

తల్లికి వందనం ఊసేదీ?



ఎన్నికల ప్రచారంలో తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు ఏటా రూ.15 వేలు నగదు అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో ఆయన మాటలు నమ్మి ఓట్లు వేశాం. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఊసే ఎత్తడం లేదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు కట్టాలని పిల్లలను తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నందున వెంటనే హామీని నెరవేర్చాలి.

–కాలే గిరిజ, డీసీపల్లి, మర్రిపాడు మండలం

మూడు సిలిండర్లు ఎప్పుడు?



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచితంగా మూడు సిలిండర్లు అందజేయనున్నట్లు నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో అందరం నమ్మాం. ఇప్పుడు దాని గురించి మరిచిపోయారు. అధికారంలోకి వచ్చాక హామీలను మరిచిపోవడం మోసం చేసినట్లే. వెంటనే చంద్రబాబు ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయాలి.

– షేక్ భాను,నందిపాడు

ఆందోళనలో రైతులు



గత ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం చెప్పిన సమయానికల్లా రైతుభరోసా నగదును ఖాతాల్లో జమ చేయడంతో రైతులు సంతోషంగా పంటలు పండించుకున్నారు. టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేయనున్నట్లు ప్రకటించింది. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా కొత్త ప్రభుత్వం పెట్టుబడి సాయంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులందరూ ఆందోళన చెందుతున్నారు.

– సుంకర రవీంద్రారెడ్డి, రైతు, అనుమసముద్రం

రైతులను ఆదుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా రైతుభరోసా నగదును రైతుల ఖాతాల్లో జమచేసే వారు. వేన్నీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్లుగా ఆ సొమ్ము పెట్టుబడికి ఎంతో ఉపయోగపడేది. టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందజేయనున్నట్లు ప్రకటించింది. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ ఊసేత్తడం లేదు. గత ప్రభుత్వం మాదిరిగానే కొత్త ప్రభుత్వం సాయం అందజేసి రైతులను ఆదుకోవాలి.

వాకా శ్రీనివాసులరెడ్డి, బ్రాహ్మణక్రాక

పిల్లలందరికీ ఇవ్వాలి



నాకు ముగ్గురు పిల్లలు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాం. ఎన్నికల సమయంలో పిల్లలందరికీ రూ.15వేలు చొప్పున ఇస్తామని టీడీపీ నాయకులు చెప్పారు. బడులు తెరిచి నెలలు గడుస్తున్నా ఆ ఊసేత్తకపోవడం తగదు. ఇచ్చిన హామీ మేరకు అందరికీ తల్లికి వందనం నగదు వెంటనే అందజేయాలి.

–పూరిమిట్ల శారద, కొండాపురం

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని, లేకపోతే నిరుద్యోగులకు భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని ప్రకటించింది. టీడీపీ కూటమిని నమ్మి నిరుద్యోగులందరూ ఓట్లేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఎలాంటి ప్రకటన చేయకపోవడం మోసం చేయడమే. నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలి.

– కొండ్రెడ్డి రవిరెడ్డి, యనమదల

బాబు మాటలతో హామీలపై అనుమానం



ఎన్నికల సమయంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఊసే ఎత్తకపోవడంతో అనుమానం కలుగుతోంది. చంద్రబాబు మాటలను చూస్తే హామీలను నెరవేరుస్తాడో.. లేదోననే సందేహం కలుగుతోంది.

–దేవవరమ్మ,దువ్వూరు, సంగం మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వలేదు



టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీ ఇచ్చింది. వంద రోజుల పాలన గడుస్తున్నా ఇప్పటి వరకు ఇవ్వలేదు. 2014 ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి కింద రూ.2వేలు ఇస్తానని చంద్రబాబు మాట తప్పాడు. గతంలో మాదిరిగా కాకుండా తక్షణమే నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. గతంలో మాదిరి యూటర్న్ తీసుకుంటే నిరుద్యోగులు తిరగబడి బుద్ధి చెబుతారు.

–తుమ్మల మాధవరెడ్డి, బ్రాహ్మణక్రాక, జలదంకి మండలం

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైనా వయోపరిమితి దాటిపోయి వేలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోయే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతిఒక్కరికీ ఉద్యోగావకాశాలు కల్పించాలి. లేకుంటే గతంలో మాదిరిగా కాకుండా వెంటనే నిరుద్యోగ భృతి అందజేయాలి.

– కావలి మనోహర్, నరసారెడ్డిపాళెం, కలిగిరి మండలం

మాట నిలబెట్టుకోరా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి పథకం కింద 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని హామీ ఇవ్వడంతో నమ్మాం. ఆడబిడ్డ నిధి ఎప్పుడు అమలవుతుందా అని ఎదురు చూస్తున్నాం. గతంలో మాదిరిగా కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళలకు వెంటనే నెలకు రూ.1500 వంతున అందజేయాలి.

– లక్ష్మి, పోలంపాడు, కలిగిరి మండలం

పెట్టుబడి సాయం అందజేయాలి



తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. సాగుకు సమయం వచ్చింది. దుక్కులు సిద్ధం చేసుకుని విత్తనాలు విత్తుకునేందుకు పెట్టుబడి సాయం అవసరం. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కొత్త ప్రభుత్వం వెంటనే రైతులకు రూ.20వేలు సాయం అందజేసి ఆదుకోవాలి. గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా విడతల వారీగా రైతుభరోసా నగదును ఖాతాల్లో జమచేసే వారు. ఇది పెట్టుబడికి ఉపయోగపడింది

–ఉప్పుటూరు చినమాలకొండయ్య, బ్రహ్మేశ్వరం,దుత్తలూరు మండలం

తల్లికి వందనం ఎప్పుడిస్తారు?



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్కూల్ యాజమాన్యం ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తోంది. తల్లికి వందనం కింద రూ 45వేలు వస్తాయి..ఫీజులకు ఇబ్బంది ఉండదని భావించా. పాఠశాలలు తెరిచి నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. కనీసం ఎప్పుడిస్తారో కూడా చెప్పడంలేదు. ఇంత మోసం చేస్తారని అనుకోలేదు.

–మండ్ల మనోజ, సీతారామపురం

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు: మున్సిపల్ నూతన కమిషనర్‌గా గంగా ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేస్తున్న షేక్ ఫజులుల్లా హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న గంగా ప్రసాద్ బదిలీపై ఆత్మకూరుకు వచ్చారు.

ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలి

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆర్డీఓ కే మధులత పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్డీఓ తన కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మూడు చోట్ల స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామని, అక్కడి నుంచే ఇసుక రవాణా జరగాలన్నారు. అక్రమంగా తరలిస్తుంటే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సంగం: అన్నారెడ్డిపాళెంలోని పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా తరలిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీపు వేలం

ఉదయగిరి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలోని పాత జీపును సీడీపీఓ పచ్చవ లావణ్య ఆధ్వర్యంలో బుధవారం వేలం వేశారు. వేలంలో గిరి అనే వ్యక్తి రూ.8,700కు జీపును దక్కించుకున్నాడు.

ఆటో కార్మికుల ర్యాలీ

ఉదయగిరి: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర కిషోర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆటో కార్మికులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులను ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆ ప్రయత్నం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గౌతమ్‌రెడ్డి పేరును కొనసాగించాలి

– వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన



సంగం బ్యారేజ్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: మెట్ట ప్రాంత రైతులకు సాగునీటిని అందించాలని ఎంతో తపన పడిన మహోన్నత వ్యక్తి దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అని, సంగం బ్యారేజ్‌కు ఆయన పేరును కూటమి ప్రభుత్వం తొలగించినంత మాత్రాన ఏమి జరగదని, ఆత్మకూరు నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. సంగం బ్యారేజ్ వద్ద ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి మెట్ట ప్రాంతానికి జలసిరిని అందించాలనే ఉద్దేశంతో అప్పటి జలవనరుల శాఖ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి సంగం బ్యారేజ్ పనులను ముమ్మరం చేయించి ప్రారంభించారని తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్–2 పనులను సైతం అప్పటి సీఎం వైఎస్ జగన్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభోత్సవం నిర్వహించి పనులను ముమ్మరం చేశారన్నారు. గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో ఆయన పేరు చిరస్థాయిగా గుర్తుండిపోయేలా బ్యారేజ్‌కు నామకరణం చేయడం జరిగిందన్నారు. బ్యారేజ్‌లకు, ఇతర ప్రభుత్వ పనులకు ప్రముఖుల పేర్లను పెట్టి స్మరించుకోవడం పరిపాటి అని, అలాంటి విధానాన్ని కాలరాస్తూ గౌతమ్‌రెడ్డిని పేరును తొలగించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి సంగం బ్యారేజ్‌కు గౌతమ్‌రెడ్డి పేరును కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పులగం శంకర్‌రెడ్డి, అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, తూమాటి విజయభాస్కర్ రెడ్డి, బొర్రా సుబ్బిరెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఎంపీపీలు పెయ్యల సంపూర్ణ, బోయళ్ల పద్మజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం వైస్‌ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జున రెడ్డి, నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, నాగులపాటి ప్రతాప్ రెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి, సూరి మదన్‌మోహన్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆంధ్రా సుబ్బారెడ్డి, కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడు, సర్పంచ్‌లు శోభ, చందన్ కుమార్, ఫణికుమార్ రెడ్డి, ఉల్లా పెంచలయ్య, బాల అంకయ్య, తోడేటి అశోక్, ఖాజా, బాబు తదితరులు పాల్గొన్నారు.

భూములపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

వింజమూరు(ఉదయగిరి): నిషేధ జాబితా నుంచి తొలిగించిన అసైన్డ్, చుక్కల ఇనామ్ భూములపై సమగ్ర విచారణ జరిపి నెలాఖరులోగా తుది నివేదిక ఇవ్వాలని జేసీ కే కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో 60వేల ఎకరాలకు పైగా భూములను ఫ్రీ హోల్డ్ చేశారని, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వింజమూరు మండలంలోని 15 గ్రామాల్లో 2,928 మంది రైతులకు చెందిన 9,474.53 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారని తెలిపా. వాటిల్లో అవకతవకలు జరిగితే గుర్తించి సరిచేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తే తిరిగి నిషేధిత జాబితాలో ఉంచుతామని తెలిపారు. కావలి ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ ఎస్‌కే హమీద్, సర్వేయర్ విష్ణు, డీటీ చేవూరి శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 376 పొగాకు చూర బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.79, కనిష్ఠంగా రూ.50 ధర లభించిందని వివరించారు.

వరద బాధితులకు విరాళం

ఆత్మకూరు: విజయవాడలో వరద బాధితుల సహాయార్థంగా పట్టణంలోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రూ.67,957 విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఎస్ అమరావతి అపస్మా ఆధ్వర్యంలో ఆత్మకూరు డిప్యూటీఈఓ గోపాల్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు బుధవారం అందజేశారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు: మండల నూతన ఎస్సైగా ఎం రఘునాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీహరికోట ఎస్సైగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

మర్రిపాడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఎంఈఓ ధనలక్ష్మి బుధవారం ప్రారంభించారు. తొలి రోజు అండర్–14 బాలుర విభాగానికి సంబంధించి వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించగా, 50 మంది పాల్గొని సత్తాచాటారు. హెచ్‌ఎం పద్మలత, పీడీలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

సోమశిల: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సోమశిల ప్రాజెక్ట్ స్టేషన్ ఎస్సై అనూష సూచించారు. బుధవారం ఆమె ఆటో డ్రైవర్ల కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలన్నారు. అధిక లోడుతో వెళ్లరాదని, ఆటో, డ్రైవింగ్ లైసెన్స్‌లను తప్పనిసరిగా కలిగి ఉండాలని, లేని వారు పది రోజుల్లో సమకూర్చుకోవాలని సూచించారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



కావలి : భారతి సిమెంట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి పేర్కొన్నారు. పట్టణంలోని విజయలక్ష్మి స్టీల్ అండ్ సిమెంట్ దుకాణంలో భారతి సిమెంట్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. అనంతరం తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువజేసే ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. సేల్స్ ఆఫీసర్ కే మణికుమార్, విజయలక్ష్మి స్టీల్ అండ్ సిమెంట్ డీలర్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ

ఉదయగిరి/ ఆత్మకూరు/ చేజర్ల/ఏఎస్‌పేట/ సీతారామపురం/వరికుంటపాడు/దుత్తలూరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ విజయలలిత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఏఎస్‌పేట మండలంలోని 19 పంచాయతీలకు ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పది మొక్కల చొప్పున పంపిణీ చేశారు. సీతారామపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవీరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వరికుంటపాడు మండలం వేంపాడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీఓ మల్లికార్జునరావు మొక్కలు నాటారు. దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరంలో సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు. ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు ఎంపీఐ కార్యాలయంలో ఎంపీఐ రాములు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్డీఏ బీ చందర్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు.

రావినూతలకు నివాళి

కావలి: మండలంలోని బైనేటివారిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రావినూతల కోటేశ్వరరావు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు స్కూల్ కాంప్లెక్స్‌లో ఎంఈఓ–2 ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు టీచ్‌టూల్స్, టీచర్స్ రీసెర్చ్ బుక్, విద్యా ప్రవేశ్, తదితర అంశాలపై బుధవారం శిక్షణిచ్చారు. అనంతరం జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఏ సురేష్ కుమార్, షేక్ సుబహాని, డెబోరా రాణి, ఎస్ శ్రీలతను సన్మానించారు. హెచ్‌ఎం ఏ వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి వద్దిబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మృతికి సంతాపం

సీతారామపురం: పండ్రంగి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సిద్దు బాలిరెడ్డి (53) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లలో నివాసం ఉంటున్న ఆయన పాఠశాలకు బైక్‌పై వస్తూ మార్గం మధ్యలో గుండెపోటుకు గురై మృతి చెందారు. హెచ్‌ఎం మృతదేహాన్ని ఎంఈఓ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జలదంకి: బ్రాహ్మణక్రాక పెట్రోల్ బంకు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జలదంకి ఎస్సై లతీఫున్నీసా బుధవారం తెలిపారు. కొత్తపాళేనికి చెందిన తిరుగాబత్తిన మధు బ్రాహ్మణక్రాక మద్యం దుకాణంలో 30 బాటిళ్లను కొనుగోలు చేసి అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

ఆత్మకూరు: నువ్వూరుపాడులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. ఉపాధి కూలీలు, మేట్లకు సూచనలు చేశారు ఏపీఓ శిరీషారెడ్డి ఉన్నారు.